క్లుప్తంగా

30న సీతారాముల కల్యాణం

ప్రొద్దుటూరు : మండలంలోని గోపవరం పంచాయతీ ఉప్పాగు కాలనీ కోదండ రామాలయంలో శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని గురువారం ఉదయం 11 గంటల నుంచి సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ చాడా చెన్నకృష్ణారెడ్డి తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

30న వీరాంజనేయుడి తిరునాల

కలసపాడు : మండలంలోని మహానందిపల్లె గ్రామంలో శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని ఈ నెల 30, 31వ తేదీల్లో వీరాంజనేయస్వామి తిరునాల నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. 30వ తేదీ గురువారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని, 10 గంటలకు సీతారాముల కల్యాణం జరుగుతుందన్నారు. 31వ తేదీన బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన మొదటి బహుమతి రూ.60 వేలు, రెండవ బహుమతి రూ.40 వేలు, మూడవ బహుమతి రూ.30 వేలు, నాల్గవ బహుమతి రూ.20 వేలు, ఐదవ బహుమతి రూ.10 వేలు అందజేస్తామన్నారు. రెండు రోజుల పాటు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.

అసెంబ్లీ బీజేపీ కన్వీనర్‌గా గొర్రె శ్రీనివాసులు



ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్‌గా గొర్రె శ్రీనివాసులును నియమిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గొర్రె శ్రీనివాసులును ప్రొద్దుటూరు అసెంబ్లీ కన్వీనర్‌గా నియమించడంపై బీజేపీ పట్టణాధ్యక్షుడు సుబ్రహ్మణ్యంతో పాటు పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.

రబ్బరు చెప్పులు పంపిణీ

రాజుపాళెం : కుష్టువ్యాధి గ్రస్తులకు అందించే రబ్బరు చెప్పులను సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యురాళ్లు మంజుల, నిఖిలలు తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో మండలంలోని కుష్టువ్యాధి గ్రస్తులకు చెప్పులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో వారు మాట్లాడుతూ విజయవాడకు చెందిన రాజేష్, అప్పరాజు ప్రత్యేకంగా వారికి చెప్పులను తయారు చేసి అందించాలని తెలిపారు. కార్యక్రమంలో డీపీఎంఓ శ్రీనివాసులు, సూపర్‌వైజర్ లక్ష్మి నారాయణ పాల్గొన్నారు.

రూ.1.28 కోట్లు పలికిన మార్కెట్ వేలం పాట

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు కూరగాయల మార్కెట్ వేలం పాట రూ.1.28 కోట్లు పలికింది. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం కమిషనర్ వెంకటరమణయ్య అధ్యక్షతన మార్కెట్ వేలం పాటను నిర్వహించారు. గతేడాది వేలం పాట రూ.1.16 కోట్లు పలకగా ఈ ఏడాది రూ.1.18 కోట్ల నుంచి వేలం పాటను అధికారులు ప్రారంభించారు. పాటలో మొత్తం 5 మంది కాంట్రాక్టర్లు పాల్గొనగా సుభాన్ అనే వ్యక్తి అత్యధికంగా రూ.1.28 కోట్లకు పాడి వేలం దక్కించుకున్నారు. దీంతో మార్కెట్‌కు భారీ ఆదాయం చేకూరినట్లు అయింది. అలాగే మాంసం, చేపల మార్కెట్‌కు సంబంధించిన వేలం పాటను కాంట్రాక్టర్ చప్పిడి కులశేఖర్‌రెడ్డి రూ.5.86 లక్షలతో దక్కించుకున్నారు. ఇందులో ముగ్గురు కాంట్రాక్టర్లు పాల్గొన్నట్లు కమిషనర్ తెలిపారు.

పరీక్షా సామగ్రి పంపిణీ

బద్వేలు : పోరుమామిళ్లలోని డాక్టర్ ఎస్.వి.ప్రసాద్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి మంగళవారం బి.కోడూరు మండలంలోని ఐత్రంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని వితరణ చేశారు.

దివంగత ఎమ్మెల్యేకు నివాళి



డాక్టర్ వెంకటసుబ్బయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బద్వేలు : దివంగత వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే డాక్టర్ వెంకటసుబ్బయ్యకు పోరుమామిళ్ల వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం ఘన నివాళులర్పించారు. పోరుమామిళ్ల మండలంలోని రంగసముద్రం సచివాలయం వద్ద డాక్టర్ వెంకటసుబ్బయ్య ద్వితీయ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

కడపలో 'పుట్టపర్తి' విగ్రహం పెట్టాలి

గోపవరం : చతుర్దశ భాషా విశారదుడు, సరస్వతీపుత్ర, పద్మశ్రీ డాక్టర్ పుట్టపర్తి నారాయణ చార్య కాంస్య విగ్రహాన్ని కడప నగరంలో పెట్టాలని కవయిత్రి మొల్ల సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు కోరారు. మంగళవారం సాహితీ పీఠం కార్యాలయంలో పుట్టపర్తి 109వ జయంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టపర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పాలనా తీరును గమనించండి

వైఎస్సార్ ఆసరా సభలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : గతంలో చంద్రబాబు, ప్రస్తుతం వైఎస్ జగన్ పరిపాలనకు వ్యత్యాసాన్ని డ్వాక్రా మహిళలు గమనించాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. స్థానిక జిన్నా రోడ్డులో మంగళవారం 14 నుంచి 24వ వార్డు వరకు సంబంధించిన డ్వాక్రా మహిళలతో వైఎస్సార్ ఆసరా మూడో విడత సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా మహిళలందరికి విడతల వారిగా రుణమాఫీ చేయడంతోపాటు సున్నా వడ్డీని చెల్లిస్తున్నారన్నారు. క్రమం తప్పకుండా ఇప్పటికి మూడో వంతు డబ్బును చెల్లించారని, మిగలిన ఒక వంతు డబ్బును వచ్చే ఏడాది చెల్లిస్తారన్నారు. గతంలో చంద్రబాబు రుణమాఫీ చేస్తానని ప్రకటించి గాలికొదిలేశారన్నారు. ఎన్నికల సందర్భంగా పసుపు కుంకుమ సెంటిమెంట్‌తో రూ.10వేలు ఇచ్చారన్నారు. మహిళలు వాస్తవాలను గ్రహించి చంద్రబాబును ఓడించారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ మహిళలందరికి సొంతిటి కలను నెరవేర్చారని, దళారులు లేకుండా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు.

పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్నాం

ముఖ్యమంత్రి జగన్ వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తుండగా, ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో మరో వైపు అభివృద్ధి కార్యక్రమాలను విరివిగా చేపడుతున్నామని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. పెన్నా హైలెవల్ బ్రిడ్జి, ఆర్టీసీ బస్టాండ్, వైఎస్సార్ ఇంజనీరింగ్ కాలేజీ, కూరగాయల మార్కెట్ నిర్మాణాలను చేపడుతున్నామని, అమృత్‌నీటి పథకం పూర్తయిందని వివరించారు. రూ.3కోట్లతో మున్సిపల్ పార్కును అభివృద్ధి చేశామని చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గానికి సంబంధించి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సుమారు రూ.5కోట్లు పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, అసిస్టెంట్ కమిషనర్ రంగస్వామి, కౌన్సిలర్లు జిలాని బాషా, వైఎస్ మహ్మద్ గౌస్, నూకా నాగేంద్రరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కామిశెట్టి బాబు, 16వ వార్డు ఇన్‌చార్జి మోపూరి శ్రీనివాసుల రెడ్డి, 19వ వార్డు ఇన్‌చార్జి చాను, మాజీ కౌన్సిలర్ రఫిక్, మెప్మా సీఓలు, ఆర్పీలు పాల్గొన్నారు.

పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలి



బదిలీ అయిన ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న హెచ్‌ఎం ఆవుల శ్రీనివాసులు

మైదుకూరు : పదో తరగతి పరీక్షల్లో అందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణులై పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని నంద్యాలంపేట జెడ్పీ హైస్కూల్ హెడ్మాస్టర్ ఆవుల శ్రీనివాసులు అన్నారు. మంగళవారం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్మాస్టర్ మాట్లాడుతూ విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను వల్లె వేసి, ఇష్టంతో పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. పబ్లిక్ పరీక్షలపై ఆందోళన చెందకుండా ప్రీ ఫైనల్ రాసినంత సులువుగా భావించాలన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులకు పరీక్షల సమయంలో ఏవిధంగా చదవాలో తెలియజేశారు. ఇటీవల పాఠశాల నుంచి ఇతర పాఠశాలలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడు సిద్ధయ్య, జూనియర్ అసిస్టెంట్ గోవిందరాజులు, రికార్డు అసిస్టెంట్ కౌసర్‌బానులను సత్కరించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమం అందరిని అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.రమేష్, ఆనంద్, సత్యనారాయణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఉచితంగా రక్తవర్గ నిర్ధారణ పరీక్షలు



రక్త వర్గ నిర్ధారణ పరీక్ష చేయించుకుంటున్న సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని మీనాపురం గ్రామ ప్రజలకు ఉచితంగా రక్త వర్గ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు రాణి తిరుమలదేవి డిగ్రీకాలేజి ప్రిన్సిపాల్ టి.చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. మంగళవారం కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా నాలుగో రోజు గ్రామ ప్రజలు, ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులకు రక్తవర్గ నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా కొత్తపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి మాట్లాడుతూ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వర రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మిషన్ లెర్నింగ్‌తో ఎన్నో ప్రయోజనాలు

వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నాగరాజు



మాట్లాడుతున్న ఆచార్య నాగరాజు

వైవీయూ: మిషన్ లెర్నింగ్‌కు సంబంధించిన అప్లికేషన్స్‌పై లోతైన అవగాహన, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు అత్యంత ఆవశ్యకమని ప్రొద్దుటూరు వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి. నాగరాజు పేర్కొన్నారు. వైవీయూ కంప్యూటర్ సైన్స్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ మిషన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ అప్లికేషన్స్' అంశంపై రెండురోజుల జాతీయ సెమినార్ రెండోరోజు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వైద్యరంగం, బ్యాంకింగ్, పరిపాలన విభాగాల్లో మిషన్ లెర్నింగ్ ఉపయోగాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సదస్సు కన్వీనర్ రెడ్డయ్య మాట్లాడారు. అధ్యాపకులు డా. శ్రీనివాసరావు, సుశీల్‌కుమార్, శివజ్యోతి, శ్వేత, అమృతపాణి, కరుణసాగర్, హనుమంతునాయక్, కృష్ణయ్య, నారాయణరెడ్డి, రాజరాజేశ్వరి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనుమతిలేని లేఅవుట్, భవనాలపై చర్యలు



అనుమతుల గురించి చర్చిస్తున్న సర్పంచ్ సుధాకర్

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల, రంగసముద్రం పంచాయతీల పరిధిలో అనుమతి లేకుండా లేఅవుట్‌లు వేసినా, భవనాలు నిర్మించిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. మంగళవారం అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ కృష్ణసింగ్ పంచాయతీ కార్యదర్శులకు సూచనలు ఇచ్చారు. భవన నిర్మాణాలకు 300 చ.మీ. వరకు పంచాయతీ కార్యదర్శుల నుంచి అనుమతి తీసుకోవచ్చని, ఆపైన లేఅవుట్‌లు, భవనాలకు అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి అనుమతి పొందాలన్నారు. ఇప్పటికే చాలామంది అనుమతి లేకుండా లేఅవుట్‌లు వేయడం, భవనాలు నిర్మించారని, వాటన్నింటికి వెంటనే అనుమతులు పొందాలన్నారు. లేనిచో చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కృష్ణసింగ్ సూచనల మేరకు పోరుమామిళ్ల పంచాయతీలో లేఅవుట్‌లు వేసినవారు, భవనాలు నిర్మించిన వారు అనుమతి తీసుకోవాలని సర్పంచ్ సుధాకర్ కోరారు.

వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు : నియోజకవర్గంలో ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో అన్నారు. మంగళవారం మైదుకూరులో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈఈ మహేశ్వర, మైదుకూరు, ఖాజీపేట ఏఈలు కిరణ్‌కుమార్‌రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డిలతో ఎమ్మెల్యే తాగునీటి పథకాలపై చర్చించారు. జల్‌జీవన్ మిషన్ కింద నియోజకవర్గంలో 331 పనులు మంజూరయ్యాయి. ఇందు కోసం రూ.17.67 కోట్లను కేటాయించారు. కాగా ఇప్పటికి 177 పనులను పూర్తి చేశామని, ఇందు కోసం రూ.4.17 కోట్లను ఖర్చు చేసినట్టు ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ వెంకటేశ్వర్లు ఎమ్మెల్యేకు వివరించారు. అన్ని మండలాల్లో 42 పనులు పూర్తి కావొస్తున్నట్టు చెప్పారు. పెన్నానది నుంచి ఖాజీపేట, మైదుకూరు మండలాల్లోని గ్రామాలకు తాగునీటిని అందించే బృహత్తర నీటి పథకం సామర్థ్యం పెంపు కోసం డీఎంఎఫ్ నిధులను వినియోగిస్తున్నట్టు ఈఈ తెలిపారు. కాగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 25 సీసీ డ్రైయిన్లు రూ.99.50 లక్షలతో చేపట్టినట్టు ఈఈ ఎమ్మెల్యే రఘురామిరెడ్డికి వివరించారు.

రవిశంకర్‌కు సన్మానం

దువ్వూరు : మండల పరిధిలోని భీమునిపాడు గ్రామానికి చెందిన గొడ్లవీటి రవిశంకర్ అంతర్‌రాష్ట్ర యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించాడు. మంగళవారం మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి గ్రామంలో విద్యార్థి రవిశంకర్‌కు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

అంజనేయ స్వామి విగ్రహాం ధ్వంసం

చాపాడు: స్థానిక పోలీసుస్టేషన్ సమీపంలోని శ్రీవీరాంజనేయ స్వామి దేవాలయంలోని ఆంజనేయ స్వామి విగ్రహాన్ని సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. మంగళవారం ఉదయం స్వామి విగ్రహాన్ని పగులగొట్టి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. గత 20 ఏళ్లుగా ఉన్న ఆంజనేయ స్వామి విగ్రహానికి ఎలాంటి హాని జరుగలేదని, ఇప్పుడు ఇలా జరగటం శోచనీయమని స్థానికులు అంటున్నారు. ఎస్‌ఐ కేసీ రాజు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో జరగకుండా కారణమైన దుండగులను పట్టుకుని కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి భూమిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, సీతారామాపురం గ్రామ యువకులు తహసీల్దారు సుభానీకి వినతి పత్రం అందజేశారు.

సీబీఐటీలో రక్తదాన శిబిరం

చాపాడు: స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కాలేజీలో మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ సహకారంతో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి కవిత పర్యవేక్షణలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. విద్యార్థులు, అధ్యాపకులతో కలుపుకుని 148 మంది రక్తదానం చేశారన్నారు.

బ్రహ్మంగారిమఠంలో ఆవులకు వింత వ్యాధి

బ్రహ్మంగారిమఠం: మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠంలో గత కొంత కాలంగా ఆవులకు వింత వ్యాధి సోకుతోందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోన్న బ్రహ్మంగారిమం పురవీధుల్లో ఆవులు విచ్చలవిడిగా సంచరిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. గత కొన్ని రోజులుగా ఆవులపై శరీరంపై పెద్ద పెద్ద మచ్చలు, పుండ్లు లాంటివి వస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆవులకు సంబంధించిన యజమానులకు అధికారులు పలుసార్లు హెచ్చరికలు చేస్తున్నప్పటికీ పట్టించుకోవటం లేదని ప్రజలు వాపోతున్నారు.

ముఖద్వారం ప్రారంభానికి సిద్ధం

పోరుమామిళ్ల : చల్లగిరిగెల శ్రీ పట్టాభి రామస్వామి దేవాలయానికి వెళ్లే భక్తులకు కొండుగారిపల్లె దగ్గర నిర్మిస్తున్న ముఖమండపం ప్రారంభానికి సిద్ధమైంది. శ్రీరామ నవమి రోజు (30 వ తేది గురువారం) స్వామీజీలచే ప్రారంభించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా నవమి కల్యాణానికి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఆలయ కమిటీ, అధికారులు చర్యలు చేస్తున్నారు. పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించడానికి సిద్ధమయ్యారు. కల్యాణం అనంతరం ప్రత్యేక పూజలు, గ్రామోత్సవం, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

చాపాడు : వైఎస్సార్ ఆసరా మూడవ విడత కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం 10 గంటలకు స్థానిక వైఎస్ కళ్యాణ మండపంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి హాజరై వైఎస్సార్ ఆసరా చెక్కులను పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమానికి ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఎంపీపీ కోరారు.

ప్రతి రోజూ గ్రామ సచివాలయాల్లో స్పందన

చాపాడు : ప్రతి రోజూ గ్రామ సచివాలయాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ స్పందన కార్యక్రమం నిర్వహించాలని మండల అభివృద్ధి అధికారి శ్రీధర్‌నాయుడు పేర్కొన్నారు. మండలంలోని అల్లాడుపల్లె గ్రామ సచివాలయంలో బుధవారం నిర్వహించిన స్పందన కార్యక్రమాన్ని ఎంపీడీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రతి రోజూ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం స్పందన కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని రికార్డులో నమోదు చేయాలన్నారు. సచివాలయ సిబ్బంది క్రమం తప్పకుండా సమయపాలన పాటించాలని, ప్రతి రోజూ బయోమెట్రిక్ హాజరు వేయాలన్నారు. సిబ్బంది విధి నిర్వహణలో ఎక్కడికి వెళ్లినా రికార్డులో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులున్నారు.

సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలకు లబ్ధి

గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధ



పి.పి.కుంటలో మహిళకు బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

గోపవరం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మంగళవారం బేతాయపల్లె సచివాలయం పరిధిలోని పి.పి.కుంట, పెద్దపోలుపల్లె గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన వివరాలను వారికి వివరిస్తూ బుక్‌లెట్‌ను వారికి అందజేశారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉన్నాయా అని ఎమ్మెల్యే ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను తెలుసుకునేందుకు అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బందితో ఇంటింటికి వచ్చామని తెలిపారు. పెద్దపోలుపల్లెలో విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయని, వాటి వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే అధికారులతో మాట్లాడి ఒకటి, రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. డ్రైనేజీ సమస్య అధికంగా ఉందని మహిళలు తెలియజేయగా, వెంటనే పనులు మొదలుపెట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. పి.పి.కుంటలో నేషనల్ హైవే రోడ్డు విస్తరణ పనుల్లో రోడ్డుకు ఇరువైపులా ఇళ్లను కోల్పోవాల్సి వస్తుందని, తమకు మరోచోట స్థలం కేటాయించాలని మూకుమ్మడిగా ఎమ్మెల్యే దృష్టికి స్థానికులు తీసుకురాగా, రెవెన్యూ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోపవరం మల్లికార్జునరెడ్డి, సచివాలయాల కన్వీనర్ పుల్లయ్య, మార్కెట్‌యార్డు డైరెక్టర్ వెంకటసుబ్బారెడ్డి, మల్లెం కొండేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా జాయింట్ సెక్రటరీ సాంబశివారెడ్డి, పార్టీ నాయకులు నరసింహారెడ్డి, శ్రీరాములు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఆధునికీకరణకు చర్యలు



తహసీల్దార్ కార్యాలయంలో ఆధునికీకరణ పనులు చేపడుతున్న దృశ్యం

బ్రహ్మంగారిమఠం : స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆధునికీకరణకు చర్యలు తీసుకుంటున్నారు. అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు మండలి వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వం ఎంఆర్‌ఓ, ఎంపీడీఓ కార్యాలయాలను 1987లో నిర్మించింది. అప్పటి నుంచి సొంత భవనాల ద్వారా అధికారులు పాలనా వ్యవహారాలు కొనసాగిస్తున్నారు. కొన్ని చోట్ల భవనాలు దెబ్బతిని ఉండగా, మరికొన్ని చోట్ల శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రభుత్వాలు అరకొరగా నిధులు విడుదల చేయడంతో ఎంఆర్‌ఓలు సున్నాలు కొట్టి చేతులు దులుపుకొనేవారు. కార్యాలయం బాగుండాలి అనే ఎంఆర్‌ఓలు మాత్రం కొంత వరకు మరమ్మతులు చేయించారు. బి.కోడూరు మండల తహసీల్దార్ కార్యాలయం డిప్యూటీ తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి డీటీ కన్నా ముందు ఎస్‌ఐగా విధులు నిర్వర్తించారు. ఆ ఉద్యోగం మాని రెవెన్యూ సర్వీస్‌లో చేరాడు. దాతల ద్వారా రూ.20 లక్షల నిధులు సేకరించి బి.కోడూరు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆధునిక హంగులతో తీర్చిదిద్దారు. తర్వాత బ్రహ్మంగారిమఠానికి బదిలీ అయ్యాడు. అప్పటికే ఇక్కడ సరైన తహసీల్దార్, డీటీలు లేకపోవడంతో వీఆర్‌ఓలు ఇష్టానుసారంగా వ్యవహరించి సమస్యలను అధికం చేశారు. డీటీగా వచ్చిన కిషోర్‌కుమార్‌రెడ్డికి అధికారులు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. ఇక్కడ భవనం, ఫర్నీచర్ సరిగా లేదని గుర్తించాడు. రూపురేఖలు మార్చేందుకు నిర్ణయం తీసుకున్నాడు. స్థానిక నాయకులు, రెవెన్యూ సిబ్బంది సహకారంతో దాదాపు రూ.30 లక్షలతో ఆధునిక హంగులతో తీర్చిదిద్దనున్నారు. ఇప్పటికే 50 శాతం పనులు పూర్తి చేశారు. మిగతా పనులు త్వరలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ ముఖ్యం

సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థులకు క్రమశిక్షణ ముఖ్యమని.. స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ ద్వారా క్రమశిణతోపాటు నైతిక విలువలు రూపుదిద్దుకుంటాయని సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కడప శంకరాపురం స్కౌట్ ప్రాంతీయ కార్యాలయంలో స్కౌట్ మాస్టర్ల, గైడ్స్ కెప్టెన్లకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులలో క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక సేవ, దేశభక్తి పెంపొందించడానికి స్కౌట్ శిక్షణ ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. బేసిక్, అడ్వాన్స్‌డ్ శిక్షణ పొందిన వారే తమ విద్యార్థులకు సమగ్రమంగా శిక్షణ ఇచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. యూనిట్ లీడర్లు అందరూ సేవా భావం కలిగి క్రమశిక్షణతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కౌట్ అండ్ గైడ్స్ సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమీషనర్ లక్ష్మీకర్, అసిసెంట్ సెక్రటరీ శివ ప్రసాద్ , ట్రెజరర్ రమణయ్య, ఏల్‌టీసీలు, వెంకటేశ్వర్లు, శకుంతలమ్మ, శంకర మ్మ, ఎస్‌టిసిలు ఉపాదేవి, మోహన్‌రావు, ఎస్‌టీసీలు శివప్రసాద్, రజియా బేగం, రెండు జిల్లాల స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు తదితరులు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వంలో మహిళలకే అగ్రస్థానం

వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ



మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

గోపవరం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మహిళలకే అగ్రస్థానం కల్పిస్తున్నట్లు ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు పేర్కొన్నారు. మంగళవారం వైఎస్సార్ ఆసరా మూడవ విడత విడుదల సందర్భంగా బద్వేలు పట్టణంలోని రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల్లో 80 శాతం మహిళలే లబ్ధిపొందారని, అంతేకాకుండా నామినేటెడ్ పదవుల్లోనూ 50 శాతం మహిళలకే కేటాయించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రతి మహిళ లక్షాధికారి కావాలన్నదే ప్రభుత్వ ఆశయమని తెలిపారు. పాదయాత్రలో జగన్‌మోహన్‌రెడ్డి అక్కాచెల్లెమ్మలకు ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతల్లో రుణమాఫీ చేస్తామని, సున్నావడ్డీతో రుణాలు ఇస్తామని ఇచ్చిన మాట ప్రకారం కోవిడ్ ప్రభావం ఉన్నప్పటికీ మూడు విడతల్లో వైఎస్సార్ ఆసరా కింద నిధులు విడుదల చేశామన్నారు. మండలంలోని 347 డ్వాక్రా గ్రూపులకు మూడవ విడత రూ.2.60 కోట్లు విడుదల చేయడం జరిగిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించి 2024లో వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. డ్వాక్రా మహిళలకు మెగా చెక్కును ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల చేతులమీదుగా అందజేశారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో అడా చైర్మన్ గురుమోహన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోపవరంమల్లికార్జునరెడ్డి, సచివాలయాల కన్వీనర్ పుల్లయ్య, సింగిల్‌విండో అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి, ఎంపీటీసీలు సరస్వతి, రాజేశ్వరమ్మ, మార్కెట్‌యార్డు డైరెక్టర్ వెంకటసుబ్బారెడ్డి, పార్టీ నాయకులు శ్రీరాములు, నరసింహారెడ్డి, రవిచంద్రారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్, ఏరియా కో ఆర్డినేటర్ సుబ్బారెడ్డి, ఎంపీడీఓ హరినారాయణ, ఏపీఎం శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా పెట్టుకోలేరా?



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పీడీ యదుభూషణ్‌రెడ్డి

అట్లూరు : పనులు సరే, రికార్డులు సక్రమంగా పెట్టుకోలేరా, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత చర్యలు తప్పవని డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి ఉపాధి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని 1-4-2021 నుంచి 1-4-2022 వరకు 681 పనులు, ఆ పనులకు సంబంధించి రూ.7.22 కోట్ల నిధులు ఖర్చుపై మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ బృందం ఎస్‌ఆర్‌పీ తిరుమలేష్ ఓపెన్ ఫోరంలో వివరాలు వెల్లడించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి హాజరయ్యారు. సామాజిక తనిఖీ బృందం వెల్లడించిన నివేదికతో రూ.1.03 లక్షల వరకు అక్రమాలు చోటు చేసుకున్నాయని, దీంతో ఆయా నిధులను రికవరీ చేశామని ఓపెన్‌ఫోరంలో వెల్లడించారు. రికార్డులను నమోదు చేయడంలో అలసత్వం వహించిన వారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ యోగానందరెడ్డి, ఏపీడీ శ్రీనివాసులున్నారు.